ఆంధ్రప్రభ
Estd. 1938
www.prabhanews.com
Journalism first!

# ముగిసిన దళిత రచయితల సదస్సు

## • చివరి రోజు అంతర్జాతీయ మాతృభాషకు అంకితం

**న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ:** కేంద్ర సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరిగిన అఖిల భారతీయ దళిత రచయితల సదస్సు మంగళవారం ముగిసింది. కథా పఠనంపై దృష్టిసారించిన మొదటి రోజు సమావేశానికి ప్రముఖ మరాఠీ రచయిత శరణ్ కుమార్ లింబాలే అధ్యక్షత వహించగా, ధీరజ్యా జ్యోతి బసుమతారి (బొర్డో), అంచటీస్ పోటే (కన్న), సత్యజిత్ అర్ (మలయాళం) తమ సొంత కథలను చదివి వినిపించారు. అనంతరం నిర్వహించిన కవితా పఠనం కార్యక్రమానికి ప్రముఖ పంజాబీ కవి, రచయిత బల్బీర్ మాధోపురి అధ్యక్షత వహించారు. కర్మశీల్ భారతి (హిందీ), బీఎల్ పరస్ (రాజస్థానీ), దీప్ నారాయణ్ విద్యార్థి (మైథిలి)తో పాటు లీలాధర్ మాండ్లోయ్ కవితలను చదివి వినిపించారు.

కవితా పఠనం తదుపరి సమావేశాన్ని అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవానికి అంకితం చేశారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గుజరాతీ కవి గజల్కర్ జంయత్ పర్మార్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా ప్రముఖ కన్నడ రచయిత హెచ్ఎస్ శివప్రకాశ్ హాజరయ్యారు. ఈ సమావేశంలో కళ్యాణి ఠాకూర్ చరల్ (బెంగాలీ), అశోక్ అంబర్ (డోగ్రీ), వీను బామ్నియా (గుజరాతీ), రజత్ రాణి మీను (హిందీ), లీలేశ్ కుడాల్కర్ (కొంకణి)తో పాటు మదన్ వీర (పంజాబీ) తమ రచనలను హిందీ, ఆంగ్ల భాషల్లో అనువదించి ప్రేక్షకులకు అందించారు. కార్యక్రమం ముగింపు సందర్భంగా సాహిత్య అకాడమీ కార్యదర్శి కే. శ్రీనివాసరావు మాట్లాడుతూ 24 భారతీయ భాషలతో పాటు ఇతర భాషల పరిరక్షణ, ప్రచారానికి సాహిత్య అకాడమీ కృషి చేస్తుందని తెలిపారు.

Date: 22/02/2023, Edition: Hyderabad , Page: 8
Source : https://epaper.prabhanews.com/